క్లుప్తంగా

మొక్కలు నాటి ఆహ్లాదం పెంచాలి



ఎద్దుల కొండపై మొక్కలు నాటుతున్న దేవస్థాన మాజీ చైర్మన్

వేంపల్లె : మొక్కలు నాటి భక్తులకు ఆహ్లాదం పెంచాలని బీజేపీ నాయకురాలు సుష్మా, వృషభాచలేశ్వర దేవస్థాన మాజీ చైర్మన్ ఎద్దుల కొండ్రాయుడులు తెలిపారు. శనివారం స్థానిక పాపాఘ్నినది సమీపంలో ఉన్న ఎద్దుల కొండపై దేవస్థానం చైర్మన్ పి.వి.రమణ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, ఆలయ సిబ్బంది, పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కమలాపురం : మండలంలోని దేవరాజుపల్లె మామిడి తోటల్లో జూదమాడుతున్న 6 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. శనివారం సమాచారం రావడంతో సీఐ ఎస్‌కే రోషన్ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బందితో కలసి జూద స్థావరంపై దాడులు నిర్వహించి ఆరు మంది జూదరులను పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 20,500 నగదుతో పాటు పేక ముక్కలు స్వాధీనం చేసున్నామని, వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు



వెల్లటూరులో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ డి.సి.టి.ఓ గీతావాణి

పెండ్లిమర్రి : ఎరువులు, పురుగు మందుల దుకాణాదారులు రైతులకు ఎమ్మార్పీ ధరలకంటే ఎక్కువ అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ డి.సి.టి.ఓ గీతావాణి హెచ్చరించారు. శనివారం వెల్లటూరులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆమె తనిఖీ చేసి రికార్డులు, స్టాక్‌ను పరిశీలించి మాట్లాడారు. దుకాణాదారులు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే రైతులకు ఎరువులు, పురుగు మందులు విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయించినట్లు రుజువైతే వారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్ఐ నారాయణ, ఏఓ కృష్ణహనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



బాల్య వివాహాలపై మాట్లాడుతున్న పూజారి రఘు

వేంపల్లె : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, చట్టవ్యతిరేక విధానాలకు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామని నాన్ గవర్నమెంట్ ఆర్గనైజర్ ఎన్జీఓ కౌన్సిలర్ బి.వాణి తెలిపారు. శనివారం గండి దేవస్థాన ఈవో వెంకటసుబ్బయ్య ఆదేశాల మేరకు గండి క్షేత్రమైన పంచముఖ ఆంజనేయస్వామి సన్నిధిలో రూరల్ డెవలప్మెంట్ ఎండోమెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్జీఓ కౌన్సిలర్ కమ్యూనిటీ సోషల్ వర్కర్స్ శివనాగమ్మ, భారతి సలహాలు సూచనలు తెలిపారు. ముఖ్యంగా గండిక్షేత్రంలో వివాహాలు జరిపే రఘుస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆధార్‌కార్డు నమోదు చేసే గండి దేవస్థాన సిబ్బంది శ్రీనివాసులరెడ్డి సమక్షంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలవలన పిల్లల జీవితాలు నాశనమవుతాయని, పిల్లల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు వారి జీవితాలు చిన్నాభిన్నమవుతాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మండల వైద్యాధికారి మహ్మద్‌తాహా

వీరపునాయునిపల్లె : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి మహ్మద్‌తాహా తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జ్వరం లక్షణాలు ఉన్న విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. చేతులను శుభ్రంగా కడుక్కోవడం, శుభ్రమైన నీరు తాగడం తదితర వాటి గురించి విద్యార్థులకు వివరించారు. జ్వరం లక్షణాలు లేదా ఏ ఇతర అనారోగ్య లక్షణాలు విద్యార్థుల్లో కనబడిన వెంటనే ఆరోగ్య కేంద్రానికి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు రమణమ్మ, అంజనమ్మ, ఆశా కార్యకర్త అమ్మన్ని, వసతి గృహాల సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌పై కొరవడిన పర్యవేక్షణ

ఎర్రగుంట్ల : నియోజవర్గంలో ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే ఆహార సలహా సంఘాల పర్యవేక్షణ కొరవడింది. రేషన్ సరుకుల నాణ్యత, ప్రజలకు చేరవేయడంలో లోపాలను గుర్తించి, ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు అందించాల్సిన సలహా సంఘాలు కన్పించడంలేదు. ప్రభుత్వాలు ప్రతి పేద కుటుంబం ఆకలి తీర్చేందుకు రేషన్ సరుకులు అందిస్తున్నాయి. చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నాయి. గతంలో నాలుగైదు రకాల నిత్యావసర సరుకులు అందించేవారు. ప్రస్తుతం బియ్యం, జొన్నలు చక్కెర మాత్రమే అందజేస్తున్నారు. చక్కెర కూడా కొన్ని ఏరియాలలో ఇవ్వడంలేదు. వీటి పర్యవేక్షణకు మండల, డివిజన్ స్థాయిలలో ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేశారు. వీరు ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై రేషన్ బియ్యం నాణ్యత, పంపిణీ తీరు, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీల్లో అందిస్తున్న పౌష్టికాహారం తదితర అంశాలపై చర్చించాలి. లోపాలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. అయితే ప్రస్తుతం ఈ సంఘాలు కనుమరుగయ్యాయి.

ఆహార సలహా సంఘాలలో సభ్యులు ఎవరంటే..

జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీఓ, మండల స్థాయిలో తహసీల్దార్లు చైర్మన్లుగా ఉంటారు. మండల స్థాయిలో ఎంపీపీ సహా చైర్మన్‌గా ఉంటారు. జెడ్పీటీసీ సభ్యుడితో పాటు ముగ్గురు మహిళా ప్రతినిధులు, వ్యవసాయ అధికారి, ఇద్దరు పాత్రికేయులు ఇద్దరు ఉపాధ్యాయులు, ఎంపీడీఓ, ఇద్దరు రైతులు, డీలరు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి, రాజకీయ పార్టీల నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు.



ఎర్రగుంట్లలోని తహసీల్దార్ కార్యాలయం

సరుకుల నాణ్యత ప్రశ్నార్థకం..

సంఘాల పర్యవేక్షన లేకపోవడంతో సరుకుల నాణ్యత ప్రశ్నార్థకంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల బియ్యం తక్కువగా వస్తున్నాయని పలువురు డీలర్లు, నాణ్యతగా లేవని లబ్ధిదారులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఇక మధ్యాహ్నన భోజనం, అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై ప్రశ్నించే వారు లేకుండా పోయారు. క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేస్తే క్షేత్ర స్థాయిలో ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పేదలకు మేలు జరుగుతుందని పలువురు అభిప్రాయం పడుతున్నారు.

మండలం	రేషన్ షాపులు	రేషన్ కార్డులు
ఎర్రగుంట్ల	37	20785
జమ్మలమడుగు	37	20879
ముద్దనూరు	30	10435
మైలవరం	31	12728
కొండాపురం	35	11885
పెద్దముడియం	25	9275

ఎర్రగుంట్ల తహసీల్దార్ ఏమంటున్నారంటే..



ఈ విషయంపై తహసీల్దార్ శోభన్‌బాబును వివరణ కోరగ ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆహార సలహా సంఘాల ఏర్పాటు కాలేదన్నారు. ప్రభుత్వం కూడా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదన్నారు. గతంలో ఏర్పాటైన ఆహార సలహా సంఘాలు మాత్రం మనుగడలో ఉన్నాయని తెలిపారు.

- శోభన్‌బాబు, తహసీల్దార్

లోక్ అదాలత్‌లో 2346 కేసులు పరిష్కారం

కమలాపురం : కోర్టు కేసుల పరిష్కారంలో రాజీ మార్గం.. రాజ మార్గం అని, లోక్ అదాలత్‌లో పైసా ఖర్చు లేకుండా కేసులు సత్వరం పరిష్కరించుకోవచ్చని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ మధుసూదన్‌రావు తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో భాగంగా గతంలో ఎన్నడూలేని విధంగా ఇరు వర్గాలు రాజీ ధోరణిలో ఉన్న 2346 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఇందులో 2333 క్రిమినల్, 9 సివిల్, 4 బ్యాంక్ కేసులు పరిష్కారం అయినట్లు వారు తెలిపారు. అనంతరం వారిని ఉద్దేశించి మెజిస్ట్రేట్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో పైసా ఖర్చు లేకుండా కేసులను సత్వరం పరిష్కరించు కోవచ్చన్నారు. రాజీ ధోరణిలో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే తర్వాత అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉండదన్నారు. ముఖ్యంగా సమస్యలున్నవారు కక్షిదారులు కక్ష్యలు, కార్పణ్యాలకు వెళ్లకుండా గ్రామ పెద్దల ఎదుట తమ సమస్యలను పరిష్కరించు కోవచ్చన్నారు. లేని పక్షంలో పోలీసులు, కోర్టు దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించు కోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు, పోలీస్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.



కక్షి దారులను విచారిస్తున్న మెజిస్ట్రేట్ మధు సూదన్‌రావు

వీధిలైట్లున్నా.. అంధకారమే?

కొండాపురం : కడప-తాడిపత్రి జాతీయ రహదారి(ఎన్‌హెచ్-67)లోని కొండాపురంలో నూతనంగా నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ఏడాది గడిచింది. రోడ్డు ఇరువైపులా వీధిలైట్లు ఏర్పాటు చేశారు. వాటికి విద్యుత్ సరఫరా ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో రాత్రివేళ అంధకారంలో ఉండటం వల్ల రోడ్డు దాటే ప్రయత్నంలో దంపతులు ఇద్దరు మృతి చెందిన ఘటన నాలుగు నెలలకిందట జరిగింది. ఇలాంటి ఘటనలు జరగకుండా ఎన్‌హెచ్ అధికారులు స్పందించి విద్యుత్ దీపాలువెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఎన్ హెచ్ ఎఈ సురేంద్రరెడ్డిని వివరణ కోరగా రోడ్డు నిర్మాణంలో భాగంగా వీధిలైట్లు ఏర్పాటు మాత్రమే అనుమతులు ఉన్నాయి. విద్యుత్ కనెక్షన్ మాకు సంబంధం లేదు కొండాపురం పంచాయతీ వాళ్ల చేయాలన్నారు. కొండాపురం ఎంపీడీఓ నాగప్రసాద్‌ను వివరణ కోరగా కొండాపురం జాతీయ రహదారి ఇరువైపులా ఎక్కువ వీధిలైట్లు ఏర్పాటు చేశారని ఖర్చు ఎక్కువగా వస్తుందన్నారు. గండికోట జలాశయం కింద కొండాపురం ముంపులోకి పోవడంతో నిధులు రావడం లేదు ఎన్‌హెచ్ అధికారులు ఐదు కిలో మీటర్ దూరంలోనే టోల్‌గేట్ పెట్టి వసూల్ చేస్తున్నారు. ఆదాయం వాళ్లకు వస్తుందన్నారు. ఈ విషయంపై నివేదిక ఉన్నతాధికారులకు పంపామన్నారు.



కొండాపురం జాతీయ రహదారిలో వెలగని వీధిలైట్లు

ప్రైవేట్‌కు అప్పగించడం దుర్మార్గపు ఆలోచన

ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వెల్లడి

జమ్మలమడుగు : రాష్ట్రంలో ఉన్న మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలనుకోవడం కూటమి ప్రభుత్వం దుర్మార్గపు ఆలోచన అని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రంలో విద్య, వైద్యం పెంచాలనే ఉద్దేశ్యంతో మెడికల్ కాలేజీలను పెంచడం తద్వారా ప్రతి విద్యార్థి డాక్టర్ అయి పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో కేంద్రంతో మాట్లాడి 17 మెడికల్ కాలేజీలను తీసుకువచ్చి అందులో 5 కాలేజీలను పూర్తి చేశారు. మిగతా కాలేజీలు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయన్నారు. ఇందుకుగాను రూ.8 వేల కోట్లు పెట్టుబడి పెట్టెందుకు ప్రభుత్వం ఒక ప్రణాళికను రుపొందించింది. కొత్త కాలేజీలకు సీట్ల సంఖ్యను కూడా పెంచింది. విజయనగరం, పులివెందుల కాలేజీలకు 50 సీట్లను కూడా పెంచింది. మెడికల్ కాలేజీలకు రూ.2 వేల కోట్లు ఖర్చు పెటిందన్నారు. అంతలోనే ఎన్నికలు రావడం కూటమి ప్రభుత్వం రావడం జరిగిందన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మెడికల్ కాలేజీలకు పెంచిన సీట్లను వద్దని కేంద్ర ప్రభుత్వానికి లెటర్ వ్రాయడం అనాలోచిత నిర్ణయం అని ఆయన విమర్శించారు. అంతే కాకుండా ప్రైవేట్ పరం చేయాలని ఆలోచన రావడం దుర్మార్గపు ఆలోచన అని దుయ్యబెట్టారు. రాష్ట్రంలో లక్ష కోట్లు విలువ చేసే మెడికల్ కాలేజీలను ప్రైవేటికరణ చేయాలనుకోవడం బాధాకరం అన్నారు. పెట్టుబడిదారులకు కూటమి ప్రభుత్వం వత్తాసు పలకడం దారుణం అన్నారు. కూటమి ప్రభుత్వం ఆలోచనను ప్రజలు ఖండిస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పొరెడ్డి మహేశ్వరరెడ్డి, రాష్ట్ర బీసీ సంఘం సెక్రటరీ గజ్జల లక్షుమయ్య, మునిసిపల్ కో అప్షన్ సభ్యుడు ఫయాజ్‌బాషా, రైతు సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, భరత్‌రెడ్డి, బడిగించల జనార్ధన్, ధన్నవాడ మహేశ్వరరెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కొత్తగా ఏర్పడిన కాలేజీల పోస్టర్లను చూపెడుతున్న ఎమ్మెల్సీ

అపరిశుభ్రతతోనే వ్యాధులు వ్యాప్తి

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలపల్లె దళితవాడలో విష జ్వరాలు వ్యాప్తి చెందుతుండటంతో శనివారం గ్రామంలో జిల్లా మలేరియా అధికారి మనోరమ, జిల్లా ఎపిడమాలజిస్ట్ ఖాజామొహియుద్దీన్ స్థానిక వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. స్థానిక ఏఎన్ఎం, సీహెచ్‌ఓ, ఆశా వర్కర్లతో రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి జ్వరాలపై గ్రామంలోని మొత్తం 243 కుటుంబాలను లార్వా సర్వేలు నిర్వహించి గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. నలుగురు జ్వర పీడితులను గుర్తించి మలేరియా డెంగీ పరీక్షలు చేసి అవసరమైన చికిత్స అందించారు. గ్రామంలో కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు ఎక్కడికి అక్కడ నిలిచి అపరిశుభ్ర వాతావరణ కారణంగా వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. యాంటీ లార్వా చర్యలు చేపట్టారు. చింతకొమ్మదిన్నె పిహెచ్‌సీలో వ్యాధుల నిర్ధారణకు అవసరమైన పరీక్షలు చేసే సౌకర్యం, మందులు ఉన్నాయని తెలిపారు. అలాగే స్థానిక పంచాయతీ కార్యదర్శి పారిశుధ్య చర్యలపై సూచనలు చేశారు. ఆరోగ్య సిబ్బంది గ్రామ ప్రజలకు సీజనల్ వ్యాధులు నిరోధక చర్యలపై అవగాహన కల్పించారు. అలాగే నాగిరెడ్డిపల్లెలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సిబ్బందికి గ్రామంలో వ్యాధుల పట్ల పర్యవేక్షణ చేయాలని సూచించారు.



బుగ్గలపల్లె దళితవాడలో నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న అధికారులు

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

వేంపల్లె : దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ రహమతుల్లా, ఎంహెచ్‌పీఎస్ పులివెందుల అధ్యక్షుడు మహబూబ్‌బాషాలు పేర్కొన్నారు. శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉన్న పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డిని వారు కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వేంపల్లె డ్రైనేజీ కాలువలు మరమ్మతులకు నోచుకోకపోవడం, కాలువల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేకపోవడంతో ప్రజలు వ్యాధుల బారినపడి ఆసుపత్రి పాలవుతున్నారన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

పులివెందుల రూరల్ : గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ వెంకటరమణ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ లింగాల, సింహాద్రిపురం, తొండూరు మండలాల్లోని గ్రామాల్లో ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ లాంటివి, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలలో ప్రయాణం ప్రమాదకరమన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నాటుసారా స్వాధీనం

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌ను అరెస్టు చేసి అతని వద్దనున్న 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. జమ్మలమడుగు రహదారిలోని శివాలయం బైపాస్ వద్ద శనివారం విజయ్‌కుమార్ నాటుసారా విక్రయిస్తుండగా అతనిని అరెస్టుచేసి కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇరికించడం అన్యాయం

కమలాపురం : కేవలం వైఎస్సార్ సీపీ నేత అనే సాకుతో నగిరి శ్రీకాంత్, వారి బంధువుల దాబాలు కూల్చడంతో పాటు అతడిని హత్యాయత్నం కేసులో ఇరికించడం అన్యాయం అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శనివారం కమలాపురం సబ్ జైలులో ఉన్న దువ్వూరు మండలం ఇడమడక గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత నగిరి శ్రీకాంత్‌ను అతడి కుమారుడు వెంకటేష్, కుమార్తె స్రవంతిలతో కలసి ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి ఘటన, ఘర్షణ జరగకుండానే 307 నమోదు చేసి శ్రీకాంత్‌ను జైలుకు పంపడం అన్యాయం అన్నారు. శ్రీకాంత్ బంధువులైన గాంతి బైరావతి, మాదం వీర భద్రుడు దాబాలను కూల్చడంతో పాటు కోర్టులో ఉన్నప్పటికి శ్రీకాంత్ దాబాను కూడా కూల్చారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాంత్ వైఎస్సార్ సీపీ చురుకైన కార్యకర్త కావడంతోనే కూటమి నేతలు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. ఇది ఇలాగే కొనసాగితే వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.



శ్రీకాంత్‌ను పరామర్శించి వస్తున్న రెడ్యం

డబుల్ రోడ్డు కలేనా..!

సింహాద్రిపురం : సింహాద్రిపురం నుంచి వెలిదండ్లకు డబుల్ రోడ్డు కలేనని స్థానిక ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. 12 కి.మీ. వెలిదండ్ల రోడ్డుకు 13 ప్రమాదకర మలుపులు ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. ప్రమాదాల నివారణకు ప్రజల సౌకర్యార్థం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డబుల్ రోడ్డును మంజూరు చేయించి రోడ్డు నిర్మాణానికి టెండర్లు వేయగా.. గురిజాల, బిదినంచర్ల గ్రామాల రైతుల పొలాలను సేకరించడానికి రైతులతో జమ్మలమడుగు ఆర్డీఓ చర్చలు జరిపారు. ఆ రైతులు ప్రభుత్వం కేటాయించిన నష్టపరిహారం సరిపోదని, ఇంకా ఎక్కువ మొత్తంలో నష్టపరిహారం కావాలని డిమాండ్ చేయడంతో రోడ్డు పనులు ఆలస్యమయ్యాయి. రైతులతో చర్చలు సఫలమై రోడ్డు వేసే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో డబుల్ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. అయితే రోడ్డు గుంతలమయమై ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచినా కూడా డబుల్ రోడ్డు గురించి ఊసే ఎత్తడంలేదని ప్రజలు వాపోతున్నారు. తారు రోడ్డు కాస్తా మట్టి రోడ్డుగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గతంలో మంజూరైన డబుల్ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



తారు రోడ్డు కాస్తా మట్టిరోడ్డుగా మారిన వెలిదండ్ల రోడ్డు

రోడ్డుపై మురుగు ప్రవాహం

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలోని సౌజన్య కాంప్లెక్స్ ముందర మ్యాన్‌హోల్ నిండి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. రెండు రోజులుగా మ్యాన్‌హోల్ నిండి మురుగునీరు ప్రవహిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. దీంతో దోమలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. అసలే వానకాలం దీనికితోడు దోమల బెడద అధికంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగునీరు రోడ్డుపై ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.



భాకరాపురంలోని రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

నేడు అమ్మవార్లకు బోనాలు సమర్పణ

పులివెందుల టౌన్ : పట్టణంలో వెలసిన గ్రామ దేవతలు అంకాలమ్మ, నడివీధి పెద్దమ్మ, శ్రీపోలేరమ్మ అమ్మవార్లకు ఆదివారం పెద్ద ఎత్తున బోనాలు సమర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు హిందు జేఏసీ నాయకులు తెలిపారు. శనివారం అమ్మవార్లకు సంబంధించిన పట్టువస్త్రాలు, బంగారు అభరణాలను కొంగనపల్లె కొండ్రావు ఇంటి వద్ద నుంచి ఆలయానికి తీసుకొచ్చారు. వీటిని ఆదివారం అమ్మవార్లకు అలంకరించనున్నారు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటల నుంచి అమ్మవార్లకు బోనాలు సమర్పించి భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించనున్నారు. అనంతరం త్రిశూల ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం వాసవీ కల్యాణ మండపంలో శాకాహారులకు, మిస్సమ్మ బంగ్లా దగ్గర మాంసాహారులకు అన్నదాన కౌంటర్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమాలకు హిందు బంధువులందరూ పాల్గొని జయప్రదం చేయాలని హిందు జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.



త్రిశూల ప్రతిష్ఠాపనకు ముస్తాబైన శ్రీపోలేరమ్మ ఆలయం

జెడ్పీటీసీ, ఎంపీపీల గౌరవ వేతనాలు విడుదల చేయాలి

వేంపల్లె : కడప జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న జెడ్పీటీసీలకు, ఎంపీపీలకు కొన్ని నెలలుగా గౌరవ వేతనాలు అందడంలేదని, వెంటనే వేతనాలు విడుదల చేయాలని చక్రాయపేట మండల జడ్పీటీసీ శివప్రసాద్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం చక్రాయపేటలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు సేవలందిస్తున్న ప్రజాప్రతినిధులు తగిన గౌరవ వేతనంలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం కృషి చేస్తున్న జెడ్పీటీసీలకు, ఎంపీపీలకు కనీస గౌరవ వేతనం కూడా సకాలంలో అందడం లేదన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ తక్షణమే జోక్యం చేసుకుని పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు విడుదల చేయాలన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వరలక్ష్మి కిడ్నీ సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు.

ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ సౌజన్య చర్మ సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08568286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

